# మాతృమయం

- మాధవరపు కృష్ణ

డిసెంబరు నెల.

దాళ్వా వరి ఊడ్పులు ఊపందుకున్నాయి. ట్రాక్టరు దమ్ము, గట్టులంకలు కొట్టడం, తోరాలు తొక్కిడి, చదును చేయడం, ఎరువు వెదజల్లడం, ఆకుతీత, నారు కట్టలు మళ్లకి చేర్చడం వగైరా పొలం పనుల్లో రైతాంగంతోబాటు ఆడామగా కూలీలు ఇబ్బడిముబ్బడిగా ఉన్నారు.

పది మంది ఆడకూలీలు పమిటలు, కచ్చాలు బిగించి సోమరాజు చేలోకి దిగి నారు కట్టలు చేతబట్టి విప్పి తొలి మూస మేస్త్రి నల్లమ్మ నాటాక అందరూ ఊడ్పు మొదలుపెట్టారు. పెదవి కదపకుండా పల్లెపదం లేకుండా ఎవరి మునుంలో వారు లీనమై మునేస్తున్నారు.

కాస్సేపటికా మునుం పూర్తయింది. అందరూ లేచి నిలబడి మరో మునుంకి సిద్ధపడుతున్నారు.

ముసలి పుల్లమ్మ, "ఏవే నల్లా! చేనుగల రైతేడి అయిపు లేదు?" అడిగింది. నల్లమ్మ మేస్త్రితనంతో బాటు సోమరాజుకి 'వతను' మనిషిగా కూడా పనిచేస్తోంది. అతడి పొలం పనులు తన బంటాతో చేయిస్తుంది. పనులు వట్టిపోయిన సమయాల్లో కూడా చిన్నాచితకా పనులు చక్కబెట్టి తక్కువ కూలి తీసుకుంటుంది. రైతు-వతను మనిషి మధ్య చక్కటి అవినాభావ సంబంధం పట్టుగా సాగిపోతుంది. అందుకే తమ రైతు బలహీనతలు అతడి ఇంటి విషయాలు వీళ్లకి కొట్టిన పిండి.

కాబట్టే పుల్లమ్మ ఆరా తీసింది. కానీ నల్లమ్మ పెదవి కదపలేదు. కానీ అదేం చెబ్తుందోనని కొద్ది క్షణాలు వేచి చూశారు.

అప్పుడు, "అదేం చెప్పదు. అయినా సోమ రాజు బాగోతం తెలీనిదెవరు? అసలే కోతి-కల్లు తాగిందన్నట్టు కట్టుకున్న పెళ్లాం ఊరెళ్లిందిగా. ఈ మహానుభావుడు ఏ పుంత పావనం చేస్తున్నాడో- ఏ పాకలో గడ్డిపరకల మీద పొర్లు తున్నాడో- ఏ వామి చాటునున్నాడో- ఈనగారికి ఏళాపాళా అక్కర్లేదు. సోమరాజు కంటే కుక్క నయం. వాటికి ఓ కారు-కాలం ఉన్నాయి..." మధ్య వయస్సు నర్సి చెప్పింది.


ఆ వెంటనే, "అందుకే నోలమ్మా! సోమరాజు పెళ్లాం నీళ్లాడ్డం లేదు ఎన్నాళ్లయినా... సారం లేని చేను పండుద్దా మన పిచ్చిగాని". లక్ష్మమ్మ అనే కూలి ముక్తాయింపు ఇచ్చింది.

వెంటనే తొమ్మండుగురు గొల్లున నవ్వారు. ఆ నవ్వుల్లో సోమరాజు తిరుగుళ్లకి నల్లమ్మ ముఖ్య సంధానకర్తన్న నిజం ఊరూ వాడా ఎరికే అన్నట్టు ధ్వనించగానే నల్లమ్మ తనలో ఎగసిన రోషాన్ని చేలో తొరం తొక్కినట్టు అణిచేసుకుంది. నోరిప్పితే మరింతగా టాంటాం చేసి పారేస్తారని జంకింది.

మగ కూలీలు ఆకుమడిలో రన్నింగ్ రేసు పొజిషన్లో కూర్చుని రెండు చేతుల్తో నారు లాగి కట్టలు కట్టి అక్కడే పడేస్తున్నారు. మధ్య మధ్య ఒకడు ఇరవై కట్టల్ని ఏరి కలిపి పోగులుగా నిలబెడ్తున్నారు. మరొకడు ఆ పోగుల్ని కట్టగా కట్టి నెత్తినెట్టుకెళ్లి చేలో దబ్బున పడేసి ఆనక విప్పి ఆ నారు కట్టల్ని ఊడ్పోళ్ల కనువుగా వుండేలా వడుపుగా విసిరి తమాషాగా సర్దుతున్నాడు. నేర్పుగా విత్తనాలు చల్లడం- నారు కట్టలు సర్దడం, గట్టు లంకలెయ్యడం వంటివి కొందరు కూలీలు నీట్‌గా చేస్తారు. అందరూ చెయ్యలేరు. డ్రాఫ్టులు ఉద్యోగులందరూ రాస్తారు. కానీ కొంతమందివి పవర్‌ఫుల్‌గా ఉంటాయి.

పది మంది ఒక్కుమ్మడిగా కొత్త మునుం పట్టారు. స్వంత చేను ఊడ్చుకున్నట్టు నోరే కాదు నడుం కూడా ఎత్తకుండా ఊడుస్తున్నారు.

అటూ ఇటూ కాస్త దూరంలోని పొలాల్లో ట్రాక్టర్ల హోరు విన్పిస్తోంది. దమ్ము చేసే వాటి వెనుక కొంగలు వాలి ఎగురుతూ మట్టి నుండి బైటపడ్డ పురుగుల్ని భక్షించి పరోక్ష సాయమందిస్తు న్నాయి రైతుకి.



“ఏవల్లా! ... ఆ ఊడ్పేంటి? కుచ్చు లెట్టేస్తున్నారు. ఈ లెఖ్ఖన నేను పోసిన ఆకు చాలదు. పైగా నారుకి కరువొచ్చి పడింది. దొరికి చావడం లేదు. నా మాటిని మూడు లేక నాల్గు కర్రలెయ్యండి. బతికిపోతాను.” ఎప్పుడొచ్చాడో సోమరాజు గట్టు మీద నిలబడి గయ్‌గయ్ మన్నాడు.

నల్లమ్మ- ఇంకో మనిషి తప్ప మిగిలిన ఎనమండుగురూ ఒకేసారి తలెత్తి, “మేం అవులించితే పేగు లెక్కెట్టగలం, నీరు పల్లానికి జారినట్టు. ఊ నువ్వెళ్లిన కార్యం పారనట్టుంది. అందుకే ఆ చిటపటలు” అన్నట్టు చూసి తలలు దించుకున్నారు తప్ప పన్నెత్తు మాటన్లేదు.

ఇంతకీ వాళ్లు లెఖ్ఖ ప్రకారం మునేస్తున్నారు. అయినా సోమరాజు రైతు భేషజం ప్రదర్శించాడు. అందుకే నోరిప్పలేదు తర్వాత.

మగ కూలీలు ఆకుమడి నుండి బైటకొచ్చి సోమరాజుకి చెప్పి అన్నానికి వెళ్లారు. వాళ్లని లెక్కపెట్టుకున్న సోమరాజు తను చెప్పినంత మందే వచ్చినందుకు సంతోషించాడు. తర్వాత అప్రయత్నంగా ఆడ కూలోళ్లని లెఖ్ఖపెట్టాడు. పదిమంది. అనుమానమొచ్చి ఈసారి వేళ్లు మడిచి లెఖ్ఖించాడు. రెండయిదులు పది లెఖ్ఖ తప్పు కాదు.

వెంటనే కోపం తెచ్చుకున్నాడు. “ఏవే! నల్లా. గొర్రెకి పెత్తనమిస్తే ఊరంతా...”

“ఒరే మనవడా! ఊరంతా కాదు. గోదారంతా...” పుల్లమ్మ సవరణ.

“ఆ.. మాకామాత్రం తెల్సు లేవే. నోరు జారింది... గోదారంతా ఈదేసినట్టు ఎకరం కప్పెట్టడానికి నీతో తొమ్మండుగురు చాలరా? మరోదాన్ని అదనంగా కలిపావు. నీ సొమ్మేం పోతుంది– నాదిగానీ...” అంటూ ఆగిపోయాడు తలెత్తిన నల్లమ్మ కళ్లల్లోని రహస్య సంకేతాన్ని గాంచి.

నల్లమ్మ తన వెనకున్న నారు కట్ట తీసి దానితో తను పిల్చిన పదో శాల్తీ పిల్లని చూపించింది. వెంటనే సోమరాజు చూసి కళ్లెగరేశాడు. కామందు కన్ను పడ్డాక నల్లమ్మ తనకేం తెలీనట్టు ఊడ్పులో పడింది.

సోమరాజు ఆ పడుచుని పరకాయించబోయాడు. కానీ ఆ పిల్ల పదిమంది వరుసలో మధ్యనుండటం వల్ల వీలు కాలేదు. అదే సమయంలో ఆ పడుచు తన చేతిలో మిగిలిన నారు పట్టి ఊడ్చేసి కొత్తది తీసుకుని లేచి నిలబడి కట్ట విప్పి దులిపి వంగి ఊడ్పుకు ఉపక్రమించింది.

ఆ చిరు క్షణాల్లో ఆ శ్రామిక యువతి అందాల్ని పసిగట్టిన సోమరాజు కళ్లని మరల్చలేకపోయాడు. పిల్లంటే పిల్ల కాదు. పండిన అనాసకాయని చెక్కినట్టుంది. ఛ... కాదు. విరిసిన పొద్దుతిరుగుడు పువ్వు. పక్వానికొచ్చిన పసుపు

దుబ్బు కాసిన పుష్పం. దీనిముందు తనెరిగిన వాళ్లంతా దిగదుడుపే! సోమరాజు కళ్లు చూస్తున్నాయి. బుర్రలో ఆలోచనలు కదుల్తున్నాయి.

సోమరాజు వారం నుండి విలవిలలాడి పోతున్నాడు. పెళ్లాం పుట్టింటికెళ్లింది. పాత ఖాతాలు అందుబాటులో లేవు. తనెళ్లిన పుంతకి చెప్పింది రాలేదు. చూసి చూసి విసుగుతో తిరిగొచ్చాడు. కొత్త గుంటని చూడగానే గువ్వ పిట్ట మాంసంతో పత్య భోజనం తినబోతున్నట్టు లొట్టలేశాడు. కానీ... సులాగ్గా దారికొస్తుందా, లేక అడ్డం తిరుగుద్దా? ఆ.. దీని తల్లో జేజమ్మ లాంటోళ్లని ఎంతమందిని జీర్ణం చేసుకోలేదూ! ఇదో లెఖ్ఖా నాకు. సోమరాజు శృంగార గర్వంతో మీసం దువ్వాడు.

ఆడదాని మొహం ఎరగనట్టు ఆబగా ఆ పిల్లని అదేపనిగా చూస్తే కూలోళ్ల ముందు అలుసైపోయి ఎకసెక్కాలు వినాల్సి వస్తుందని సోమరాజు చూపు తిప్పి పొడిదగ్గు దగ్గాడు. నల్లమ్మ తలూపింది సోమరాజుకి కనిపించేటట్టు. దాని సంధానకర్త జ్ఞానంకి సోమరాజు భలే ముచ్చటపడ్డాడు. ఈ విషయంలో నల్లమ్మే సాటి అనుకుంటూ ఊడ్పు పొలానికి కాసింత దూరంలోని పశువుల పాక-చిన్న మంచినీళ్ల చెరువున్న దిమ్మ మీదకొచ్చి ఒక కొబ్బరి చెట్టు మొదలుకి జేరబడి కూర్చుని చుట్ట ముట్టించి కొత్తపిల్ల ధ్యాసలో లీనమై కాలుస్తున్నాడు కళ్లు మూసి.

ఈ వారం నాగా లోటు కాస్సేపట్లో పూడి పోతుంది. పిల్ల వయస్సులో పిటపిటలాడి పోతోంది... ఏం అందం... ఏం అందం దాన్ది!

మొహారవిందం తూర్పారబోసిన మేలురాసి. కళ్లు పెరిగిన వరి మొక్కాకులు. ముక్క పండిన ధాన్యం కంకి. చెవులు చిలగడ దుంపాకులు. పెదాలు పనస పువ్వులు. కంఠం కందగొడుగు కాడ! ... ఊహలు పోలికలు సోమరాజుని ఊపిరి సలపనివ్వడం లేదు. కళవెళ్లాడిపోతున్నాడు.

"పిల్లా! కాళి. నోరెండి పోతోంది. బిందెడు నీళ్లట్రా." దోవ చెప్పి నల్లమ్మ తెలివిగా పని పురమాయించింది. కాళి గబగబా దిమ్మెక్కి చెరువులో బిందె ముంచగానే బుడబుడ శబ్దమైంది.

సోమరాజు కళ్లిప్పి చూశాడు. అప్సరస ప్రత్యక్షమైంది.

కచ్చా పోసి కట్టిన చుక్కల చీరలో బిగుతు రవికతో కాళి. పిల్ల యౌవన సంపదకి సోమరాజు వళ్లు గరపొడిచింది. నాలుక నరాలు జివ్వు మన్నాయి. రక్తం- కన్నం తీయగానే నీరు పారినట్టు- శరీరంలో ఉరకలెత్తింది.

నీళ్ల బిందెతో కాళి వెళ్లిపోతుంటే సోమరాజు టక్కున లేచి నిలబడ్డాడు. నోట్లో చుట్ట కింద పడింది.

"ఏవే! నీ పేరేంటి? ఊరికి కొత్తా?" సోమరాజు.

వెనక్కి తిరిగి, "నా పేరు కాళి. నేను వెంకన్న కొత్త కోడల్ని" చెప్పింది.

సోమరాజు రెండంగల్లో వచ్చి ఎదురు నిలబడి తమకంతో "ఎంత ముద్దొస్తున్నావే..." అంటూ కన్నూమిన్నూ కానని కాంక్షతో కాళి గుండెలపై చేతులు వేయబోయాడు.

"ఏరా! కూలికొచ్చే ఆడంగులందరూ అదే బాపతనుకున్నావా? రూపాయికి అర్ధకి కక్కుర్తి పడతారనుకున్నావా? పుల్లకి పిడక్కి గడ్డికి కమ్మలకి చవకబారు అత్తర్లకి వళ్లప్పగించుతారను కుంటున్నావా? ప్రతీ ఇంట్లో ఉంటాది మట్టి పొయ్యి..." అని కాళి రౌద్రరూపంతో తిట్టలేదు. శూలం వంటి హస్తం ఎత్తి విసర్లేదు.

నిశ్శబ్దంగా వెనక్కి జరిగి అప్పుడు పెదవులు విప్పింది.

"తప్పు తమ్ముడూ! మీ అమ్మది మా ఊరు. నీ కన్నతల్లి మా అయ్య మీద మనసు పడితే పెళ్లికి ముందు నేను పుట్టాను. మీ నాన్నకి పెళ్లయ్యాక నువ్వు పుట్టావు. మనిద్దరం ఒకే పేగు తెంచుకుని పుట్టినోళ్లం సోమరాజు తమ్ముడూ." అంటూ అక్క కాళి వెళ్లిపోతుంటే-

సోమరాజు తన తల్లి ప్రతిబింబాన్ని చూస్తూ అవాక్కయిపోయాడు.

ఆ తర్వాత ప్రతీ ఆడపిల్లలోనూ తల్లి కనిపించడం మొదలైంది సోమరాజుకి.

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004. Chief Editor : I. Venkata Rao.